జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

బుధవారం | 3-6-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 691 పేజీలు: 4 వెల : రూ.7





# ఇసుకను.. తోడేస్తున్నారు!

* భారీ యంత్రాలతో తవ్వి, వందలాది వాహనాలతో తరలింపు
* అనధికారికంగా ఇసుక ర్యాంపు
* అధికారులకు కనిపించడం లేదా అని గ్రామస్థుల ఆగ్రహం
* మా పంట భూములు నాశనం అవుతున్నాయి
* తక్షణం ఇసుక ర్యాంపును నిలిపివేయండి
* లేకుంటే తడాఖా చూపిస్తాం
* ఇసుక రవాణాను అడ్డుకున్న ఎంఎల్‌పురం గ్రామస్థులు



**హిరమండలం/కొత్తూరు, జూన్ 2 (వార్త):** వంశధార నది నుంచి అక్రమంగా ఇసుకను దోచేస్తున్నారు.. దీనివల్ల మా పంట భూములు నాశనం అవుతున్నాయి.. తక్షణం దీన్ని ఇసుక ర్యాంపులో తవ్వకాలు ఆపకుంటే మా తడాఖా చూపిస్తామని ఎంఎల్‌పురం గ్రామస్తులు హెచ్చరించారు. ఇసుక ర్యాంప్ వద్ద మంగళవారం ధర్నాకు దిగారు. ఇసుక వాహనాలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ వంశధార నదిలో ఇసుక ర్యాంప్ ఏర్పాటు చేసి రాత్రి,పగలు అనే తేడా లేకుండా ఇసుకను భారీ వాహనాలతో ఇసుకను తరలిస్తున్నారన్నారు. ఇక్కడ ఇసుక ర్యాంప్ అనధికారికంగా నడుపుతున్నారని తెలిపారు. ఇసుకను ఇష్టారాజ్యంగా తోడేస్తున్నారన్నారు. వంశధార నదికి వరదలు సంభవించినట్లయితే పంట భూముల్లోకి వరద నీరు చేరే ప్రమాదం ఉందన్నారు. నదిలో చాలా లోతుగా నిబంధనలకు వ్యతిరేకంగా యంత్రాలతో తవ్వకాలు చేస్తున్నారన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధుల పేర్లు చెప్పి ఇసుక తోడేస్తున్నారన్నారు. ఇసుక ర్యాంప్ నిలుపదల చేయకుంటే పంట పొలాలు నాశనమయ్యే పరిస్థితులు ఏర్పడతాయన్నారు. తక్షణమే ఇసుక ర్యాంప్ నిలుపుదల చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఇసుకను భారీ వామనాలతో తరలించే సమయంలో నవతల - శ్రీ ముఖలింగం రహదారిలో ఇసుక రహదారి అంతా పడుతోందని, దీనివల్ల వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ఇసుక ర్యాంప్‌ను తక్షణమే నిలిపివేసి భూగర్భజలాలను కాపాడాలని వారు కోరారు.



## 4 నుంచి 12 వరకూ..
# వైసీపీ పోరుబాట

* 'వెన్నుపోటుకు రెండేళ్లు' పేరుతో నిరసనలు
* 4న బాబు, పవన్ సంతకాల బాండ్ల దహనం
* 8,9 తేదీల్లో సదస్సులు
* 12న నిరసనలు, ర్యాలీలు
* పోస్టర్ ఆవిష్కరించిన నేతలు ధర్మాన కృష్ణదాస్, తమ్మినేని సీతారాం

**శ్రీకాకుళం, జూన్ 2 (వార్త):** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని ఆరోపిస్తూ 'వెన్నుపోటుకు రెండేళ్లు' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి ధర్మాన కృష్ణదాస్ ప్రకటించారు. మంగళవారం శ్రీకాకుళంలోని వైసీపీ జిల్లా కార్యాలయంలో మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంతో కలిసి ఆయన 'వెన్నుపోటుకు రెండేళ్లు' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్, పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ, జూన్ 4వ తేదీ నుంచి 12వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా విస్తృత స్థాయిలో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా విస్మరించారని ఆరోపించారు. ప్రజలను నమ్మిస్తూ విడుదల చేసిన మేనిఫెస్టోలు, సంతకాల బాండ్లను జూన్ 4న మండల కేంద్రాల్లో దహనం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. జూన్ 4న మండల కేంద్రాల్లో టీడీపీ మేనిఫెస్టో, బాబు-పవన్ సంతకాల బాండ్ల దహనం, 8, 9 తేదీల్లో అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో 'వెన్నుపోటుకు రెండేళ్లు' పేరుతో టౌన్‌హాల్ సదస్సులు, 12న జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో భారీ నిరసన ర్యాలీలు చేపట్టనున్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలను నిలిపివేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందని ధర్మాన కృష్ణదాస్ విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ పరిశీలకులు, ఎమ్మెల్సీ కుంబా రవిబాబు, కిల్లి సత్యనారాయణ, నియోజకవర్గ పరిశీలకులు అందవరపు సూరిబాబు, కరిమి రాజేశ్వరరావు, దుంపల రామారావు, చల్ల రవికుమార్, యెన్ని ధనుంజయ్, రాష్ట్ర ఎస్ఈసీ సభ్యులు గొండు కృష్ణమూర్తి, చల్ల శ్రీనివాస్, రాష్ట్ర వెలమ విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, రాష్ట్ర తూర్పు కాపు విభాగం అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షురాలు మెంటాడ పద్మావతి, ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



## కిడ్నీ ఆసుపత్రిలో..
# దొంగలు పడ్డారు

* ఓ రోగి బ్యాగు నుంచి బంగారం, నగదు తస్కరణ
* అధికారులకు ఫిర్యాదు చేసిన బాధితులు
* ఇదంతా ఇక్కడ కామన్ అంటున్న సిబ్బంది


బంగారం పోయిందని చెబుతున్న బాధితులు

**పలాస, జూన్ 2 (వార్త):** పలాసలోని కిడ్నీ రీసెర్చ్ ఆస్పత్రిలో దొంగలు పడ్డారు. గైనిక్ వార్డులో చికిత్స పొందుతున్న ఓ మహిళ కుటుంబ సభ్యుల బ్యాగ్‌లోని బంగారు ఆభరణాలు, నగదును దొంగిలించేశారు. ఈవిషయాన్ని అక్కడి సిబ్బందికి రోగి బంధువులు చెబితే ఇక్కడ ఇదంతా కామన్ అని, మనమే జాగ్రత్తగా ఉండాలని హితవు పలకడం గమనార్హం. వివరాల్లోకి వెళితే.. పాతపట్నం మండలం తెంబూరు గ్రామానికి చెందిన చెల్లుబోయిన నారాయణమ్మ ఆపరేషన్ కోసం కిడ్నీ రీసెర్చ్ ఆసుపత్రిలో చేరింది. ఆమె మెడలో ఉన్న బంగారు పుస్తెలు, శతమానం బిళ్లను కుమార్తె రాజేశ్వరి బ్యాగ్‌లో ఉంచింది. ఆ బ్యాగును ఆమెకు కేటాయించిన బెడ్ వద్దనే భద్రపరచింది. ఆమె టాయిలెట్‌కు వెళతానని చెప్పడంతో కుమార్తెను దగ్గరుండి తీసుకువెళ్లింది. ఆ తర్వాత బ్యాగు పరిశీలించగా బంగారం, నగదు కనిపించకపోవడంతో వారు లబోదిబోమన్నారు. ఈ విషయమై అక్కడున్న సిబ్బంది దృష్టికి వారు తీసుకువెళ్లారు. ఆ తర్వాత ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ శ్రీహరిబాబుకు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు చేపడతామని ఆయన తెలిపారు. ఈ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు బాధితులు సంసిద్ధమవుతున్నారు. ఆసుపత్రిలో సీసీ కెమెరాలు పరిశీలిస్తే దొంగతనం ఎవరు చేశారన్నది బయటపడే అవకాశం ఉంది.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం




## ద్విచక్ర వాహన చోరీ కేసులో ఒకరికి జైలుశిక్ష

**సారవకోట, జూన్ 2(వార్త):** ద్విచక్ర వాహన చోరీ కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తికి పాతపట్నం కోర్టు జైలు శిక్ష విధించింది. సారవకోట మండలం బుడితి గ్రామానికి చెందిన కోర్ల శివకు 8 నెలల సాధారణ కారాగార శిక్ష విధిస్తూ పాతపట్నం సివిల్ జడ్జి రోషిణి సోమవారం తీర్పు వెలువరించారు. ఈ విషయాన్ని ఎస్సై అనిల్ కుమార్ వెల్లడిస్తూ, మండలంలోని చీడిపూడి గ్రామానికి చెందిన బోర సతీష్ గత ఏడాది మార్చిలో తన ద్విచక్ర వాహనం చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని చెప్పారు. దర్యాప్తులో కోర్ల శివ ద్విచక్ర వాహన చోరీకి పాల్పడినట్లు ఆధారాలు లభించడంతో అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేసినట్లు ఎస్సై వివరించారు. కేసును విచారించిన పాతపట్నం కోర్టు నిందితుడికి 8 నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చిందన్నారు. నేరాల నియంత్రణలో భాగంగా పోలీసులు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారని, ప్రజలు తమ వాహనాల భద్రతపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.



## ఏపీ మోడల్ కళాశాలలో ఇంటర్ ప్రవేశాల
# ఎంపిక జాబితా విడుదల

- జూన్ 6 నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం
- ధ్రువపత్రాలతో హాజరు కావాలని ప్రిన్సిపాల్ సూచన



**పోలాకి, జూన్ 2 (వార్త):** ఈదులవలసలోని ఏపీ మోడల్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రవేశాలకు సంబంధించిన ఎంపిక జాబితాను విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రవీణ తెలిపారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె ఈ వివరాలను వెల్లడించారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను కళాశాల నోటీస్ బోర్డులో ప్రదర్శించామని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు జూన్ 6వ తేదీ నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు అడ్మిషన్ సమయంలో పదో తరగతి హాల్ టికెట్, మార్కుల మెమో, విద్యార్థి మరియు తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్ (టీసీ), కుల ధ్రువీకరణ పత్రం తదితర అవసరమైన సర్టిఫికెట్లను తీసుకురావాలని సూచించారు. అడ్మిషన్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేసుకునేందుకు ఎంపికైన విద్యార్థులు నిర్ణీత తేదీల్లో కళాశాలకు హాజరుకావాలని ప్రిన్సిపల్ తెలిపారు. మరిన్ని వివరాలకు కళాశాల కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.


# సోంపేట అభివృద్ధికి నిర్లక్ష్యపు చెదలు!

- పనులు పూర్తయినా తెరుచుకోని ప్రభుత్వ భవనాలు
- వృధాగా పడి ఉన్న సచివాలయం, రైతు సేవా కేంద్రాలు

**సోంపేట, జూన్ 2(వార్త):** లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన అధునాతన ప్రభుత్వ భవనాలు అధికారుల నిర్లక్ష్యంతో చెదలు పడుతున్నాయి. కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన కొద్దిపాటి బిల్లులు చెల్లించకపోవడంతో భవనాలు నిర్మాణం జరిగి సుమారు మూడేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ తెచ్చుకోకపోవడంతో భవనాలు చెదలు పట్టి మళ్లీ శిథిలావస్థలోకి వెళ్లే పరిస్థితులు సోంపేటలో నెలకొన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలను ప్రతి మండలంలో కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన విషయం తెలిసిందే. కొన్నిచోట్ల నిర్మాణాలు పూర్తయి ప్రస్తుతం ఆయాచోట్ల గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల పనితీరుతో కళకళలాడుతున్నాయి. మరికొన్నిచోట్ల భవన నిర్మాణాలు పూర్తయినప్పటికీ కొద్దిపాటి బిల్లులను కాంట్రాక్టర్లకు చెల్లించుకోలేక ఆయా భవనాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. సరిగ్గా ఈ కోవలోనే సోంపేట పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల వద్ద గ్రామ సచివాలయం -2 అలాగే రైతు సేవా కేంద్రం భవనాలు దాదాపుగా పూర్తయి సేవలందించేందుకు ఎదురుచూస్తున్నాయి. సంబంధిత అధికారులు సరైన చర్యలు తీసుకుని ఆయా భవనాలు వినియోగంలోకి తీసుకురావడంలో విఫలమవుతున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. దీంతో ఆయా భవనాలు ప్రారంభం కాకపోవడంతో సోంపేట రెండవ సచివాలయం, రైతు సేవ కేంద్రం సిబ్బంది చిన్నపాటి ఇరుకు గదుల్లో ప్రతిరోజు రెండు ఏళ్లుగా సేవలందించాల్సిన దుస్థితి నెలకొంది. వివిధ పనులపై ఇక్కడికి వచ్చే ప్రజలు కూడా అసౌకర్యాన్ని ఎదుర్కోవాల్సి వస్తోంది. ఈ పరిస్థితి నుంచి బయటపడేందుకు అటు ప్రజాప్రతినిధులు గాని, ఇటు అధికారులు గాని కనీసం దృష్టి సారించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇటువంటి సౌకర్యాలను వినియోగంలోకి తీసుకురావాలన్న ఆలోచనలో లేకపోవడం గమనార్హం.

ఇక్కడ సుమారు 40 లక్షల వ్యయంతో గ్రామ సచివాలయం, సుమారు 22 లక్షల వ్యయంతో రైతు సేవ కేంద్రా లను పూర్తి చేశారు. ఇలాగే మరికొద్ది కాలం ఈ భవనాల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తే పరిస్థితి మళ్లీ మొదటికే వస్తుందని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఇటువంటి భవనాలను సత్వరం వినియోగంలోకి తీసుకు వచ్చేందుకు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.





# ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రుల ఆసక్తి

- బడి పిలుస్తుంది' కార్యక్రమానికి మంచి స్పందన
- ఏడుగురు విద్యార్థుల చేర్పునకు సుముఖత వ్యక్తం

**జలుమూరు, జూన్ 2(వార్త):** రామయ్యవలస ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల చేరికలను పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన 'బడి పిలుస్తుంది' కార్యక్రమానికి తల్లిదండ్రుల నుంచి మంచి స్పందన లభించిందని ఎంఈఓలు బమ్మిడి మాధవరావు, ఎంవీఎస్ ప్రసాదరావు తెలిపారు. మంగళవారం ఆ గ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా అధికారులు ఇంటింటికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రస్తుతం ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరుతూ ప్రభుత్వ విద్యలో అందుతున్న సదుపాయాలు, నాణ్యమైన బోధన, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజన పథకం వంటి అంశాలను వివరించారు. ఈ సందర్భంగా ఏడుగురు విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, బోధన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని, విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ప్రభుత్వ విద్యను ప్రోత్సహించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్థులు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని ఎంఈఓలు పేర్కొన్నారు. ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# పిచ్చికుక్క స్వైర విహారం.. 15 మందిపై దాడి

- తిలారు రైల్వే స్టేషన్ పరిధిలో స్థానికుల్లో భయాందోళన
- గాయపడిన వారిలో విశ్రాంత ఉద్యోగి కృష్ణారావు

**జలుమూరు, జూన్ 2 (వార్త):** తిలారు రైల్వే స్టేషన్ పరిధిలో పిచ్చికుక్క స్వైర విహారం స్థానికులను భయాందోళనలకు గురి చేసింది. సోమవారం సాయంత్రం గ్రామంలో సంచరిస్తున్న ఓ పిచ్చికుక్క పలువురిపై దాడి చేసి గాయపరిచిన ఘటన కలకలం రేపింది. స్థానికుల కథనం ప్రకారం, గ్రామ వీధుల్లో తిరుగుతున్న కుక్క ఒక్కసారిగా ప్రజలపై దాడి చేయడం ప్రారంభించిందని తెలిపారు. ఈ ఘటనలో విశ్రాంత ఉద్యోగి మణిపాత్రుని కృష్ణారావుకు కాలుపై, చేతిపై తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను నరసన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అదేవిధంగా సుమారు 15 మందిపై కుక్క దాడి చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. కుక్క దాడులతో చిన్నారులు, మహిళలు, వృద్ధులు భయంతో ఇళ్ల నుంచి బయటకు రావడానికి కూడా వెనుకంజ వేస్తున్నారని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో తిరుగుతున్న పిచ్చికుక్కను వెంటనే పట్టుకుని ప్రజలకు రక్షణ కల్పించాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు, పశుసంవర్ధక శాఖ సిబ్బంది తక్షణ చర్యలు తీసుకుని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నారు. కుక్క కాటుకు గురైన వారు వెంటనే వైద్య పరీక్షలు చేయించుకుని అవసరమైన యాంటీ రేబిస్ టీకాలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.



## శిథిలావస్థకు చేరుకున్న..
# వంశధార కాలువ వంతెన

- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు, గ్రామస్థులు
- వెంటనే మరమ్మతులు చేపట్టాలని స్థానికుల విజ్ఞప్తి

**సారవకోట, జూన్ 2 (వార్త):** బద్రి సమీపంలో వంశధార ఎడమ కాలువపై నిర్మించిన వంతెన ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకోవడంతో రైతులు, గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ వంతెన ద్వారా బద్రి, అక్కివలస, గుమ్మపాడు తదితర గ్రామాల ప్రజలు తమ పంట పొలాలకు వెళ్లడంతో పాటు మామిడిజోల ప్రాంతానికి రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుతం వంతెన దెబ్బతినడంతో వాహనదారులు, పాదచారులు భయాందోళనల మధ్య ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా రైతులు వ్యవసాయ పనుల నిమిత్తం ప్రతిరోజూ ఈ మార్గాన్ని వినియోగిస్తుండగా, వంతెన ప్రమాదకరంగా మారడంతో ఇబ్బందులు మరింత పెరిగాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో వంతెన మరింత దెబ్బతినే అవకాశం ఉందని, ప్రమాదాలు జరిగే ప్రమాదం కూడా ఉందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి వంతెనను పరిశీలించి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలకు వంతెనలు కీలకమని, వాటి నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. రైతులు, విద్యార్థులు, గ్రామస్థులకు ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.





# రూ.13 లక్షలతో పాఠశాల అభివృద్ధి పనులు

- కొత్తూరు పాఠశాలలో మౌలిక వసతుల మెరుగుదల
- పునఃప్రారంభం నాటికి పనులు పూర్తి చేస్తాం
-ఎంఈఓ రమణ

**సారవకోట, జూన్ 2 (వార్త):** కొత్తూరు గ్రామంలోని పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించే లక్ష్యంతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) ఎంవీ రమణ తెలిపారు. సర్వశిక్ష అభియాన్ నిధులతో సుమారు రూ.13 లక్షల వ్యయంతో పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాఠశాల తరగతి గదుల అభివృద్ధితో పాటు మరుగుదొడ్ల నిర్మాణం, రన్నింగ్ వాటర్ సదుపాయం కల్పించడం, పాఠశాల ఆవరణలో సిమెంట్ రహదారి నిర్మాణం వంటి పనులు చేపడుతున్నామని వివరించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన మరియు సౌకర్యవంతమైన విద్యా వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ఈ పనులు జరుగుతున్నాయని తెలిపారు. పాఠశాలలు తిరిగి ప్రారంభమయ్యే ఈ నెల 12వ తేదీ నాటికి అన్ని అభివృద్ధి పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పనుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు మెరుగుపడటం వల్ల విద్యార్థులకు మంచి విద్యా వాతావరణం ఏర్పడటంతో పాటు హాజరు శాతం కూడా పెరిగే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## కరవంజ ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్ అడ్మిషన్లు ఆరు నుంచి ప్రారంభం



**జలుమూరు, జూన్ 2(వార్త):** ఏపీ మోడల్ స్కూల్, కరవంజలో 2026-27 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ ప్రవేశాల కోసం ఎంపికైన విద్యార్థుల జాబితాను పాఠశాల నోటీస్ బోర్డులో ప్రదర్శించినట్లు ప్రిన్సిపల్ రఘుపాత్రుని శివకుమార్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ఎం.పి.సి, బై.పి.సి, ఎం.ఇ.సి, సి.ఇ.సి గ్రూపుల్లో అడ్మిషన్లు పొందేందుకు అవసరమైన ధ్రువపత్రాలతో జూన్ 6వ తేదీన ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పాఠశాలకు హాజరుకావాలని సూచించారు. అడ్మిషన్ ప్రక్రియ కోసం విద్యార్థులు 10వ తరగతి పాస్ సర్టిఫికెట్, ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్, విద్యార్థి మరియు తల్లిదండ్రుల ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులు, మూడు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, కుల మరియు ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని తెలిపారు. అన్ని సర్టిఫికెట్లను మూడు సెట్లుగా సిద్ధం చేసి సర్టిఫికెట్ ఫోల్డర్ కవర్‌తో సమర్పించాలని పేర్కొన్నారు. అడ్మిషన్ ప్రక్రియను నిర్ణీత తేదీలోపు పూర్తి చేసుకోవాలని, ఆలస్యానికి అవకాశం ఉండదని పాఠశాల యాజమాన్యం స్పష్టం చేసింది. పూర్తి వివరాల కోసం ప్రిన్సిపల్ రఘుపాత్రుని శివకుమార్‌ను 9440322964 నంబరులో సంప్రదించవచ్చని తెలిపారు.

# ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తే నేరమా?

**-ప్రజల గొంతుకను నొక్కలేరు**

**-సామాన్యులపై ఆస్తి పన్ను భారం ఎందుకు?**

**-కేవిటి సామాజిక వర్గానికి న్యాయం ఎప్పుడు?**


**- ప్రభుత్వ ఆస్తులను కాపాడేది ఎవరు**

**- మద్యం ధరల దోపిడీపై చర్యలు ఎక్కడ?**

**- మువ్వల నగేష్ కుటుంబానికి న్యాయం ఎప్పుడు?**

**- పలాసను జిల్లా జాబితా నుంచి ఎందుకు తప్పించారు?**

**పలాస, జూన్ 2(వార్త):** "ఫేక్ అకౌంట్లతో తనపై, కుటుంబంపై దుష్ప్రచారం చేయిస్తున్నారని ఎమ్మెల్యేపై శ్రీధర్ బాబా ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం దువ్వాడ శ్రీధర్ బాబా పలాసలో తన నివాసం వద్ద విలేకరులతో మాట్లాడుతూ పలాస ఎమ్మెల్యే తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజా సమస్యలపై తాను గొంతెత్తుతున్నందుకు తనపై, తన కుటుంబ సభ్యులపై, తన ఆస్తులపై సోషల్ మీడియాలో ఫేక్ అకౌంట్ల ద్వారా అసత్య, తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. పదుల సంఖ్యలో నకిలీ ఖాతాల నుంచి అవమానకర పోస్టులు, ట్రోలింగ్ చేస్తూ వ్యక్తిగతంగా తనను లక్ష్యంగా చేసుకుని మానసికంగా వేధించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు."ప్రజాస్వామ్యంలో ప్రజా సమస్యలపై ప్రశ్నించడం, ఎన్నికల హామీలను గుర్తు చేయడం, అన్యాయంపై స్పందించడం ప్రతి పౌరుడికి రాజ్యాంగబద్ధ హక్కు ఉందని, నేను ఎవరిపైనా వ్యక్తిగత కక్షతో, ద్వేషంతో పోరాడటం లేదని, నేను అడుగుతున్నవి పలాస ప్రజల సమస్యలు మాత్రమే... ప్రజల తరఫున అడుగుతున్న ప్రశ్నలు మాత్రమేనని అన్నారు. వాటికి సమాధానం చెప్పకుండా నా వ్యక్తిగత జీవితంపై దాడి చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం" అని శ్రీధర్ బాబా స్పష్టం చేశారు. పలాసను జిల్లాగా ప్రకటిస్తామని గతంలో ప్రభుత్వం హామీ ఇచ్చి, చివరి క్షణంలో జాబితా నుంచి తప్పించడంపై ఎమ్మెల్యే ఎందుకు నోరు మెదపడం లేదని ఆయన నిలదీశారు. "పలాస ప్రజల చిరకాల స్వప్నాన్ని ఎందుకు కాలరాశారు? దీనిపై ప్రజలకు స్పష్టమైన వివరణ ఇవ్వాల్సిన బాధ్యత పలాస ఎమ్మెల్యేకి లేదా? పలాస జిల్లా అంశాన్ని అసెంబ్లీలో ఒక్కసారైనా బలంగా లేవనెత్తారా?" అని ప్రశ్నించారు. అనుమానాస్పద పరిస్థితుల్లో ప్రాణాలు కోల్పోయిన మువ్వల నగేష్ కుటుంబం ఇప్పటికీ న్యాయం కోసం ఎదురు చూస్తోందని ఆయన గుర్తు చేశారు. "2024 ఎన్నికల సమయంలో నారా లోకేష్ '100 రోజుల్లో న్యాయం చేస్తాను' అని బహిరంగ సభలో హామీ ఇచ్చారన్నారు. ఆ 100 రోజులు ఎప్పుడో దాటిపోయాయని, ఆ కుటుంబానికి న్యాయం చేసే బాధ్యత ఎమ్మెల్యేగా మీకు లేదా?" అని



నిలదీశారు. పలాస నియోజకవర్గంలోని వైన్ షాపుల్లో ఎంఆర్‌పీ కంటే ?10 నుంచి ?20 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని, గ్రామాల్లో బెల్ట్ షాపుల్లో అయితే ఒక్కో బాటిల్‌పై ?50 వరకు దోపిడీ జరుగుతోందని ప్రజలు వాపోతున్నారని తెలిపారు. "ఈ అక్రమ వసూళ్లపై ఎక్సైజ్ శాఖను అడిగే దమ్ము ఎమ్మెల్యేకు లేదా? పేదవాడి కష్టాన్ని దోచుకుంటుంటే చూస్తూ ఊరుకోవడం న్యాయమా?" అని ప్రశ్నించారు. చెరువులు, దేవాదాయ భూములు, ప్రభుత్వ కొండలు, ఇతర ప్రభుత్వ భూములు యథేచ్ఛగా ఆక్రమణలకు గురవుతున్నాయని ఆరోపించారు. "ప్రభుత్వ ఆస్తులకు కంచెలు వేసి, వాటిని రక్షించి, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధిగా మీకు లేదా?, భవిష్యత్ తరాలకు మనం ఏం మిగులుస్తాం?" అని నిలదీశారు. కేవిటి సామాజిక వర్గం రాష్ట్ర బీసీ జాబితాలో ఉన్నప్పటికీ, కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చాలనే డిమాండ్ దశాబ్దాలుగా ఉందని గుర్తు చేశారు. "ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించి, కేంద్ర ప్రభుత్వంతో చర్చించేలా అసెంబ్లీలో తీర్మానం చేయించే ప్రయత్నం ఎమ్మెల్యేగా మీరు ఎందుకు చేయడం లేదు?" అని ప్రశ్నించారు. పలాస మున్సిపాలిటీలో ప్రతి ఏటా ఆస్తి పన్ను ఆటోమేటిక్‌గా 15% పెరగడంతో సామాన్య, మధ్యతరగతి, వ్యాపార కుటుంబాలపై విపరీతమైన భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రజల నడ్డి విరుస్తున్న ఈ పన్ను విధానంపై ఎమ్మెల్యేగా మీరు ఎందుకు స్పందించడం లేదు?, మున్సిపల్ కౌన్సిల్‌లో ఈ అంశాన్ని ఎందుకు లేవనెత్తలేదు?" అని నిలదీశారు. "నాపై వంద పోస్టులు పెట్టవచ్చు... వేల కామెంట్లు చేయవచ్చు... కానీ ప్రజల సమస్యలపై లేవనెత్తిన ప్రశ్నలను విస్మరించలేరు. నేను నిన్న ప్రజల కోసం మాట్లాడాను... ఈరోజు కూడా మాట్లాడుతున్నాను... రేపు కూడా మాట్లాడుతాను... అవసరమైతే ధర్నాలు చేస్తాను... నిరాహార దీక్షలు చేస్తాను... చట్టబద్ధమైన పోరాటం కొనసాగిస్తాను... ఎందుకంటే నాకు రాజకీయాలు ముఖ్యం కాదు... నాదగ్గరకొచ్చిన ప్రజల సమస్యలే నాకు ముఖ్యం" అని శ్రీధర్ బాబా తేల్చి చెప్పారు. "అధికారం శాశ్వతం కాదు... పదవులు శాశ్వతం కాదు... కానీ ప్రజలే శాశ్వతం. ఈరోజు అధికార బలం, ధన బలం ఉండవచ్చు. కానీ చివరికి ప్రజాస్వామ్యంలో తీర్పు చెప్పేది ప్రజలే. నిజంగా ప్రజల పట్ల బాధ్యత, చిత్తశుద్ధి ఉంటే, నేను లేవనెత్తిన ఏడు ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వండని డిమాండ్ చేశారు. పలాస ప్రజలకు సమాధానం చెప్పండి... ప్రజల గొంతుకను వినండి... ప్రజల గొంతుకను నొక్కలేరు" అని ఆయన హెచ్చరించారు.

## సోంపేట రోడ్డుపై ..
# ప్రమాద ఘంటికలు!



**సోంపేట, జూన్ 2(వార్త):** సోంపేట రోడ్డులో ప్రమాదఘంటికలు మోగుతున్నాయి. ఏ ప్రమాదం ఎప్పుడు ఎక్కడ జరుగుతుందో ఊహించలేని పరిస్థితి నెలకొంది. జింకీభద్ర వద్ద మెయిన్ రోడ్డు పై భారీ గుంతలు ఏర్పడి ఇటీవల ప్రమాదాలు అధికమవుతున్నాయి. అనేకమంది ఇక్కడ ద్విచక్ర వాహనాలపై నుంచి పడి గాయాల పాలవుతున్నారు. అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడంతో స్థానికులే రోడ్డు మధ్యలో గల గుంతలో ఎర్రజెండా నిలబెట్టి ప్రమాద హెచ్చరికలు చేస్తున్న దృశ్యం ప్రస్తుతం ఆవిష్కృతమై ఉంది. కొర్లాం నుంచి సోంపేట మీదుగా కంచిలి సమీపంలో ఫ్లైఓవర్ వరకు పక్కా రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వాలు ఏమాత్రం సహకరించకపోవడం,నిధులు మంజూరు చేయకపోవడంతో మొక్కుబడి మరమ్మతులతో ఆర్ అండ్ బి అధికారులు కాలం వెళ్లదీస్తున్నారు. లక్షల రూపాయల్లో ప్రతిసారి మంజూరు అవుతున్న మెయింటినెన్స్ పనులు నాసిరకంగా చేపట్టడంతో కొద్ది నెలల్లోనే రోడ్డు మళ్ళీ మామూలు పరిస్థితికి వచ్చి భారీ గుంతలు ఏర్పడి ప్రజలను తీవ్ర ఇక్కట్లు పాలు చేస్తున్నాయి. పక్కా రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడంలో ప్రజా ప్రతినిధులు ఇప్పటికైనా చొరవ చూపాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలకు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

**-ఇంటింటా ప్రచారం నిర్వహించిన ఎంఈఓ-2 దాలినాయుడు**

**- ముగ్గురు విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరిక**

**జలుమూరు, జూన్ 2(వార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను పెంచేందుకు నరసన్నపేట మండలం బుచ్చిపేటలో మంగళవారం ప్రత్యేక ఎన్రోల్మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 దాలినాయుడు పాల్గొని గ్రామంలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. మోడల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి గ్రామ ప్రజలను కలుసుకుని ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న విద్యా ప్రమాణాలు, సౌకర్యాల గురించి వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న ముగ్గురు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులు, డిజిటల్ బోధన, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు వంటి సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ



పాఠశాలల్లో చేర్పించి అందుబాటులో ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని ఎంఈఓ-2 దాలినాయుడు కోరారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడం అందరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో మడపం క్లస్టర్ ప్రధానోపాధ్యాయిని భారతి, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మలేరియా నివారణపై ప్రజలకు అవగాహన

**- దోమల నివారణకు పరిసరాల పరిశుభ్రత పాటించాలి**

**- ఉర్లాంలో అవగాహన ర్యాలీ నిర్వహించిన వైద్య సిబ్బంది**

**నరసన్నపేట , జూన్ 2 (వార్త):** మలేరియా వ్యాధి నివారణ పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారిణి షాలిని సూచించారు. మంగళవారం నరసన్నపేట మండలం ఉర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వర్షాకాలం ప్రారంభమయ్యే జూన్ నెలలో మలేరియా వ్యాధులు ఎక్కువగా వ్యాపించే అవకాశం ఉంటుందని తెలిపారు. దోమల పెరుగుదలకు కారణమయ్యే నీటి నిల్వలు, మురుగునీటి కుంటలు లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలకు సూచించారు. ఇళ్ల పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకుపోకుండా చూసుకోవడం, నీటి ట్యాంకులు, పాత్రలను మూతపెట్టడం, దోమతెరలు ఉపయోగించడం వంటి జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. జ్వరం, వణుకు, తలనొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. మలేరియా నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, ఆరోగ్య శాఖ సూచనలు పాటించడం ద్వారా వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చని ఆమె పేర్కొన్నారు. ఈ అవగాహన ర్యాలీలో వైద్య సిబ్బంది గణపతిరావు, రమణతో పాటు ఆరోగ్య కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# బాలికల రక్షణకు శక్తి యాప్

**-విద్యార్థులకు అవగాహన కల్పించిన శక్తి టీం పోలీసులు**

**- అప్రమత్తంగా ఉండాలని సూచనలు**

**నరసన్నపేట, జూన్ 2 (వార్త):** బాలబాలికలు స్వీయ రక్షణపై అవగాహన పెంపొందించుకుని అత్యవసర పరిస్థితుల్లో ధైర్యంగా స్పందించేందుకు శక్తి యాప్ ఎంతో ఉపయోగపడుతుందని శక్తి టీం హెడ్ కానిస్టేబుల్ గిరిధర్, మహిళ పోలీస్ కానిస్టేబుల్ ధనలక్ష్మి తెలిపారు. మంగళవారం నరసన్నపేట పట్టణంలోని ఓ ప్రైవేట్ స్టడీ కేంద్రంలో విద్యార్థులకు శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మహిళలు, బాలికల భద్రత కోసం ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిన శక్తి యాప్ అత్యవసర సమయాల్లో తక్షణ సహాయం అందించేందుకు ఉపయోగపడుతుందని వివరించారు. అలాగే పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ, బాలలపై జరిగే లైంగిక వేధింపులు, దాడులు చట్టరీత్యా తీవ్రమైన నేరాలని తెలిపారు. ఎలాంటి అనుమానాస్పద పరిస్థితులు ఎదురైనా భయపడకుండా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ప్రమాద సూచనలు కనిపించినప్పుడు లేదా అత్యవసర పరిస్థితుల్లో వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలని విద్యార్థులకు సూచించారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుని భద్రతా చర్యలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని శక్తి యాప్ వినియోగంపై సందేహాలను నివృత్తి చేసుకున్నారు.




## ఇంటర్నెట్‌పై .
# అంగన్వాడీ కేంద్రాల్లో అవగాహన




**పలాస, జూన్ 2 (వార్త):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బాలికలకు ఎదురయ్యే సమస్యలపై అవగాహన కల్పించడానికి 'కిశోరి వికాసం' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించిందని కాశిబుగ్గ ఐ సి డి ఎస్ కోఆర్డినేటర్ జనార్ధన్ తెలిపారు. సున్నాడా అంగన్వాడి కేంద్రంలో వేసవి కిషోర్ వికాసంలో భాగంలో మంగళవారం చిన్నారులకు ఇంటర్నెట్ పై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని అంగన్వాడి కేంద్రాల్లో ఇంటర్నెట్ ద్వారా అమలు చేయడం వల్ల గణనీయమైన ప్రయోజనాలు ఉన్నాయని,కానీ కొన్ని అనర్థాలు కూడా రావచ్చునని చెప్పారు. ఇంటర్నెట్ ద్వారా గ్రామీణ ప్రాంతాలలో ఉన్న అంగన్వాడి కేంద్రాలకు కూడా తక్షణమే అవగాహన సమాచారం అందుతుందని చెప్పారు. ఆరోగ్యం, అనీమియా, బాల్య వివాహాలపై వీడియోలు, ఇన్ఫోగ్రాఫిక్స్ ద్వారా స్పష్టమైన అవగాహన కలుగుతుందని తెలిపారు. అంగన్వాడి కేంద్రాల్లో ఇంటర్నెట్ ద్వారా 'కిశోరి వికాసం' అవగాహన కార్యక్రమాన్ని అమలు చేయడం వల్ల బాలికల శిక్షణ, ఆరోగ్యం, విద్య, నైపుణ్యంలో గణనీయమైన మెరుగుదల సాధ్యమని తెలిపారు. కానీ, ఇంటర్నెట్ కనెక్టివిటీ, డిజిటల్ సాక్షరత, సమాచార భద్రత వంటి సవాళ్లను పరిష్కరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించి, అంగన్వాడి కార్యకర్తలకు డిజిటల్ శిక్షణ ఇస్తే, ఈ కార్యక్రమం మహిళల ఉజ్వల్ భవిష్యత్తుకు పునాది అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ లత, అంగన్వాడి కార్యకర్త ఉమాదేవి, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## అప్పుల బాధ తాళలేక యువకుడి ఆత్మహత్య

**సోంపేట, జూన్ 2(వార్త):** సోంపేట చిన్న పల్లివీధికి చెందిన యువకుడు తెలుకల యుగంధర్ (28) అప్పుల బాధలు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన సమాచారం ప్రకారం యుగంధర్ తన అత్తవారి గ్రామమైన జింకిభద్రలో కొంతమంది వద్ద అప్పులు తీసుకున్నాడు. కొన్ని అప్పులు తీర్చివేయగా ఇంకా కొద్దిమంది వద్ద తీసుకున్న అప్పులు తీర్చాల్సి వుంది. ఈమేరకు అప్పులు తీర్చాలని తీవ్ర ఒత్తిళ్ల నెపథ్యంలో రెండు రోజులు క్రితం యుగంధర్ గడ్డి మందు తాగి ఆత్మహత్య కు ప్రయత్నం చేసాడు. వెంటనే తెలుసుకున్న గ్రామస్తులు సోంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా ప్రథమ చికిత్స చేసి శ్రీకాకుళం రిఫర్ చేశారు. శ్రీకాకుళం నుంచి వైజాగ్ కేజీహెచ్ కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి యుగంధర్ మృతి చెందాడు. మృతినికి భార్య, ఇద్దరు పిల్లలు వున్నారు. సోంపేట ఎస్ ఐ మోహిని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## హెల్మెట్ ధారణ ఎంతో ఉత్తమం

**మందస, జూన్ 2(వార్త):** వాహనదారులు హెల్మెట్ ధరించడం ఎంతో ఉత్తమమని ఝుంకర్ డ్యాన్స్ స్కూల్ మేనేజింగ్, డైరెక్టర్ ప్రముఖ ఒడియా ఫిల్మ్ యాక్టర్ రిషికేశ్ సామల్ అన్నారు. మందస మండలంలోని హరిపురం-బాలిగాం జంక్షన్లో ఝుంకర్ డ్యాన్స్ స్కూల్ మేనేజింగ్, డైరెక్టర్ ప్రముఖ ఒడియా ఫిల్మ్ యాక్టర్ రిషికేశ్ సామల్ మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ హెల్మెట్ ధారణపై ఈ నెల 4న ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు మందస పోలీస్ శాఖ ఆధ్వర్యంలో, పర్యవేక్షణలో హెల్మెట్ ధరించడం మీద అవగాహన కోసం ఒక మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బావన దుర్యోధన, పలాస సర్కిల్ ఇన్స్పెక్టర్ తిరుపతిరావు, మందస సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ కె.కృష్ణప్రసాద్, ప్రముఖ సినీ నిర్మాత, డైరెక్టర్ కుమార్ నాయక్, చలనచిత్ర నటుడు అమ్మ రామకృష్ణ, అసిస్టెంట్ డాన్స్ మాస్టర్ రంజిత్ ముఖ్యఅతిథులుగా హాజరు కానున్నారని తెలిపారు. హరిపురంలో గల అన్ని విద్యాసంస్థల నుంచి మేనేజ్ మెంట్, యువతీ, యువకులు హెల్మెట్ ధరిస్తూ పాల్గొని, హెల్మెట్ ధరించడం వలన కలిగే ప్రయోజనాలను వివరిస్తూ ర్యాలీ నిర్వహించడానికి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.




## 4న మందసలో వెన్నుపోటు నిరసన ర్యాలీ



**మందస, జూన్ 1(వార్త):** రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు ఈ నెల 4న మందస మండల కేంద్రంలో వెన్నుపోటు నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మందస మండల అధ్యక్షుడు దల్లి జానకిరెడ్డి చెప్పారు. మందసలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో ఎన్నికల హామీలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలకు మోసం చేసిందన్నారు. ఈ సందర్భంగా మందస మండల కేంద్రంలో జూన్ 4న తేదీన ఉదయం 10గంటలకు మాజీమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సారధ్యంలో వెన్నుపోటు నిరసన ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మందస మండల, పట్టణ పార్టీ నాయకులు, వివిధ అనుబంధ విభాగాల నాయకులు, మాజీ సర్పంచ్ లు, ఎమ్పీటీసిలు, పార్టీ అభిమానులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## క్రికెట్ పోటీలు ప్రారంభం

**కంచిలి, జూన్ 2(వార్త):** పెద్ద శ్రీరాంపురం గ్రామంలో సింధు పోలమ్మ క్రికెట్ టోర్నమెంట్ను మంగళవారం మండల టీడీపీ అధ్యక్షులు మాదిన రామారావు ప్రారంభించారు. స్థానిక యువత ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీల్లో ముఖ్య అతిధిగా రామారావు పాల్గొని మాట్లాడారు. యువత క్రీడల పట్ల ఆసక్తి చూపాలని కోరారు. క్రీడల్లో మంచి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు.



## ప్రభుత్వ విద్య బలోపేతానికి ..
# ఎంఈఓ మర్రిపాటి ప్రత్యేక చొరవ

**-ఇంటింటికీ వెళ్లి ప్రవేశాలు పెంచుతున్న 'లక్ష్మణరావు'**

**- ఆయన కృషిపై సర్వత్రా హర్షం**

**- సహకరిస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు**

**మందస, జూన్ 2(వార్త):** మారుతున్న కాలంతో పాటు ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయి.. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలలు అంటే కేవలం పేద విద్యార్థులకే పరిమితం అనే భావన ఉండేది.. కానీ నేడు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్య, వసతులు ప్రభుత్వ బడుల్లో అందుతున్నాయి.. ఈ విద్యా విప్లవం వెనుక అధికారులు, ఉపాధ్యాయుల నిరంతర శ్రమ దాగి ఉంది.. ఈ క్రమంలోనే, శ్రీకాకుళం జిల్లా మందస మండల విద్యాశాఖాధికారి మర్రిపాటి లక్ష్మణరావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచడానికి చేస్తున్న కృషి స్థానికంగా పెను మార్పులకు శ్రీకారం చుడుతోంది.

### గ్రామాల్లో ప్రత్యేక అవగాహన సదస్సు

మందస మండలంలో బడిబాట కార్యక్రమం సందర్భంగా రాత్రి వేళల్లో సైతం గ్రామాల్లో పర్యటించి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు ఎంఈఓ మర్రిపాటి లక్ష్మణరావు. ఉపాధ్యాయులు, విద్యా సిబ్బంది బడిబాట-రాత్రింబవళ్ళు అవగాహన కల్పిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో జాయినింగ్స్ పెంచడం కోసం ఎం.ఇ.ఓ ఒక ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నారు. కేవలం కార్యాలయ విధులకే పరిమితం కాకుండా, స్వయంగా క్షేత్రస్థాయిలోకి వెళ్ళి పరిశీలిస్తున్నారు. గ్రామీణ మరియు వెనుకబడిన ప్రాంతాల్లోని తల్లిదండ్రులను కలుసుకుని, ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న విద్యా ప్రమాణాలపై అవగాహన కల్పిస్తున్నారు. బడిబాట కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా నడిపించి, ఏ ఒక్క పిల్లవాడు కూడా బడికి దూరం కాకూడదనే సంకల్పంతో రాత్రి వేళల్లో సైతం ప్రతి ఇంటినీ పలకరిస్తూ విద్య ఆవశ్యకతను వివరిస్తున్నారు.

### ప్రభుత్వ విద్యా పథకాలపై విస్తృత ప్రచారం

ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన విద్యార్థులకు అందే ప్రయోజనాలను వివరిస్తూ, నమోదు పత్రాలను విద్యాశాఖ బృందం పరిశీలిస్తున్నారు. ప్రభుత్వ విద్యా పథకాలపై విస్తృత ప్రచారం కల్పిస్తున్నారు.

### కార్పొరేట్ సంస్థలకు దీటుగా ప్రభుత్వ వసతులు

ప్రభుత్వం అందిస్తున్న విద్యా కానుక(కిట్స్), మన బడి నాడు-నేడు ద్వారా మారిన పాఠశాలల మౌలిక సదుపాయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో లక్ష్మణరావు కీలక పాత్ర పోషిస్తున్నారు. డిజిటల్ క్లాస్ రూములు, ఇంగ్లీష్ మీడియం బోధన, రుచికరమైన మధ్యాహ్న భోజనం వంటి అంశాలను తల్లిదండ్రులకు స్వయంగా వివరిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా నేడు ప్రభుత్వ బడులు ఉన్నాయనే నమ్మకాన్ని వారిలో



రెట్టింపు చేస్తూ అడ్మిషన్లు జరుపుతున్నారు.

### తల్లిదండ్రుల్లో పెరిగిన నమ్మకం

చిన్నారులను ప్రభుత్వ బడికి పంపేలా తల్లిదండ్రులను ఒప్పించి, వారికి అడ్మిషన్ పత్రాలను ఎంఈఓ లక్ష్మణరావు అందజేస్తున్నారు.

### ఉపాధ్యాయ లోకానికి దిశానిర్దేశం

ఉత్తమ పరిపాలనాధికారిగా, మందస మండలంలోని ఉపాధ్యాయులందరినీ లక్ష్మణరావు ఎప్పటికప్పుడు ఉత్తేజపరుస్తున్నారు. ఉపాధ్యాయులలో సేవాభావాన్ని పెంపొందిస్తూ, ప్రైవేట్ పాఠశాలల వైపు వెళ్తున్న విద్యార్థులను తిరిగి ప్రభుత్వ పాఠశాలల వైపు ఆకర్షించేలా చేయడంలో ఆయన పర్యవేక్షణ, మార్గదర్శకత్వం ఎంతగానో దోహదపడ్డాయి.

### ప్రజల ప్రశంసలు

మందస మండల విద్యాశాఖాధికారి మర్రిపాటి లక్ష్మణరావు నిరంతర శ్రమ, విద్యా వ్యవస్థపై ఉన్న అంకితభావం కారణంగా నేడు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో జాయినింగ్స్ సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రైవేట్ బడుల మోజులో పడి ఆర్థికంగా నష్టపోతున్న ఎన్నో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతను తెలిపి, వారి పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేశారు. విద్యా రంగానికి ఆయన చేస్తున్న ఈ అమూల్యమైన సేవలకు మందస మండల ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నారు.

## సంక్షేమ, విద్యా అసిస్టెంట్ 'యువరాజ్' ఔదార్యం



**మందస, జూన్ 2(వార్త):** చిత్తశుద్ధితో ఉద్యోగులు విధులు నిర్వహించడం ఒక ఎత్తయితే.. మానవత్వం చూపడం ఆ ఉద్యోగి ఔదార్యానికి నిదర్శనం. అటువంటి ఉద్యోగులు పదికాలాల పాటు చల్లగా ఉండాలని ప్రజలు ఆకాంక్షిస్తుంటారు. ఓ సచివాలయం ఉద్యోగి సరిగా ఇదే చేశారు. వివరాల్లోకి వెళ్తే.. మందస మండలంలోని సువర్ణపురం సచివాలయంలో సంక్షేమ, విద్యా సహాయకునిగా అల్విన్ యువరాజ్ పని చేస్తున్నారు. ఇదే గ్రామానికి చెందిన ఇప్పిలి వెంకటరావు అనే వ్యక్తి కిడ్నీవ్యాధితో బాధ పడుతున్నాడు. పరిస్థితి డయాలసిస్ వరకు చేరుకుంది.

జిల్లా కేంద్రమైన శ్రీకాకుళంలో గల రిమ్స్ లో వెంకటరావు గత 20రోజులుగా డయాలసిస్ పొందుతున్నాడు. ప్రభుత్వం నుంచి వస్తున్న ఎన్టీఆర్ పింఛన్ భరోసా కిడ్నీవ్యాధి కింద ప్రతీ నెల పొందుతున్నారు. ఈ నెల వెంకటరావు అందుబాటులో లేకపోవడంతో సంక్షేమ, విద్యా సహాయకునిగా అల్విన్ యువరాజ్ వెంకటరావుకు సంబంధించిన పింఛను ఎలాగైనా అందజేయాలన్న మంచి మనసుతో శ్రీకాకుళంలోని రిమ్స్ కు వెళ్లి, పింఛను అందజేశారు.

యువరాజ్ మంచితనాన్ని గుర్తించిన అధికారులు, గ్రామస్తులు, వెంకటరావు కుటుంబం ఆయనను అభినందించారు.

## సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

**-కిషోరి వికాసం సద్వినియోగం చేసుకోవాలి**

**- ఐసీడీఎస్ సూపర్ వైజర్ రాజేశ్వరి**

**మందస, జూన్ 2(వార్త):** సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, వేసవి సెలవుల్లో నిర్వహిస్తున్న కిషోరి వికాసం కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ రాజేశ్వరి అన్నారు. మందస మండలంలోని సరియాపల్లి పంచాయతీలో గల చిన్నబహడపల్లి గ్రామంలో మంగళవారం కిషోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ వేసవిసెలవుల్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సెల్ ఫోన్ పై ప్రతీ ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. సైబర్ మోసాలపై ఎంతో అప్రమత్తంగా ఉండాలని కోరారు. రోజు, రోజుకూ సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, అపరిచిత ఫోన్ కాల్స్ పై జాగ్రత్తంగా ఉండాలన్నారు. ఆన్ లైన్ లో జరిగే మోసాలను వివరించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్ వాడీ కార్యకర్తలు కె.నారాణమ్మ, ఎం.నారాయణమ్మ, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.



# నరకప్రాయం..!

**-ఊపిరాడని ఇరుకు గదులు..**

**-గంటల తరబడి వృద్ధులు నిలబడుతూ అవస్థలు!**

**-పార్కింగ్ లేక రోడ్లపైనే వాహనాలు**

**- నిత్యం నరకయాతన పడుతున్న కొనుగోలుదారులు, అర్జీదారులు**

**-ఖాళీగా ఉన్న పాత 'మీసేవ' భవనంలోకి మార్చాలి**

**-మున్సిపాలిటీ మాజీ కో-ఆప్షన్ మెంబర్ బమ్మిడి సంతోష్ కుమార్ డిమాండ్**

**పలాస, జూన్ 2 (వార్త):** లక్షల రూపాయల చలానాలు కట్టి, ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరుస్తున్నా, సామాన్య ప్రజలకు పలాస సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో కనీస మర్యాద, సౌకర్యాలు కరువయ్యాయని, ప్రస్తుతం ఉన్న కార్యాలయంలో కనీస వసతులు లేకపోవడంతో రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారని పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ మాజీ కో-ఆప్షన్ మెంబర్ బమ్మిడి సంతోష్ కుమార్ డిమాండ్ చేశారు. నిత్యం వందలాది మందితో కిటకిటలాడే ఈ ఆఫీసులో, కనీసం కూర్చోవడానికి నాలుగు కుర్చీలు వేసుకునే స్థలం కూడా లేకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని, భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే వృద్ధులు, మహిళలు, రోగులు గంటల తరబడి నిలబడలేక నరకయాతన అనుభవిస్తున్నారు. ఇరుకైన గదులు, ఊపిరాడని వాతావరణంతో అటు అర్జీదారులు, కొనుగోలుదారులు ఇటు దస్తావేజు లేఖరులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.



### ట్రాఫిక్ ఉచ్చులో పలాస.. రోడ్లపైనే పార్కింగ్

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అత్యంత ఇరుకైన వీధిలో ఉండటం వల్ల సమస్య మరింత జటిలంగా మారింది. ఇక్కడికి వచ్చేవారికి కనీస పార్కింగ్ స్థలం లేదు. దీంతో కొనుగోలుదారులు, అమ్మకందారులు తమ వాహనాలను రోడ్డుపైనే నిలపాల్సి వస్తోంది. ఫలితంగా నిత్యం భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడి, స్థానిక ప్రజలు, రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర అంతరాయం ఎదుర్కొంటున్నారు. అత్యవసర సమయాల్లో అంబులెన్సు సైతం కదల్లేని పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆదాయానికి లోటు లేదు.. కానీ ప్రజల ప్రాణాలకు రక్షణేది? "ప్రజల నుంచి ట్యాక్సుల రూపంలో కోట్లాది రూపాయలు వసూలు చేస్తున్న ప్రభుత్వం, వారికి కనీస సౌకర్యాలు కల్పించకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ఆస్తి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే పలాస ప్రజలు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని రావాలా?" అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిష్కారం కళ్లముందే ఉన్నా.. నిర్లక్ష్యం ఎందుకు? గతంలో పలాసలో ఉన్న "మీసేవ కేంద్రం" భవనం ప్రస్తుతం పూర్తి ఖాళీగా దర్శనమిస్తోంది. ఆ భవనం ఎంతో విశాలమైనదిగా ఉండటమే కాకుండా, ప్రజల రాకపోకలకు అత్యంత అనుకూలమైన ప్రధాన ప్రదేశంలో ఉంది. అక్కడికి కార్యాలయాన్ని మారిస్తే ప్రజలు కూర్చోవడానికి తగినంత స్థలం ఉంటుంది. వాహనాల పార్కింగ్కు విశాలమైన స్థలం దొరుకుతుంది. పట్టణంలో ట్రాఫిక్ చాలా వరకు పరిష్కారమవుతుంది. పలాస ప్రజల పడుతున్న ఈ నరకయాతనను దృష్టిలో ఉంచుకుని, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించాలని ప్రజల ప్రయోజనాల కంటే ఏదీ ముఖ్యం కాదని, తక్షణమే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఖాళీగా ఉన్న పాత మీసేవ కేంద్రం భవనంలోకి మార్చాలని ఆయన విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో ప్రజల పక్షాన నిలుస్తామని బమ్మిడి సంతోష్ హెచ్చరించారు.




## వాసుదేవుని ఆలయంలో ఆధ్యాత్మికత

**-భక్తి, శ్రద్ధలతో మూలానక్షత్ర అభిషేకాలు**

**-దాసాంజనేయునికి విశేష పూజలు**



**మందస, జూన్ 2(వార్త):** భక్తుల కొంగు బంగారంగా పిలవబడుతున్న శ్రీ వాసుదేవ పెరుమాళ్ళుని దేవాలయం మంగళవారం ఆధ్యాత్మికతతో మారుమోగింది. వాసుదేవుని జన్మనక్షత్రమైన మూలానక్షత్రం సందర్భంగా ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. వేకువజామునుంచే ఆండాళ్లగోష్టి ఆధ్వర్యంలో ఆలయాన్ని శుభ్రపరచి, సుందరంగా అలంకరించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితులైన గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు జరిగాయి. జల, క్షీర, మకరందం తదితర అభిషేకాలు అనంతరం శ్రీవాసుదేవునికి దివ్యాలంకృతునికావించారు. భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. మందస పరిసర ప్రాంతాల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. కాగా, మంగళవారం కావడంతో వసుదేవుని క్షేత్రపాలకుడైన అభయదాసాంజేయునికి కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమలపాకుల దండతో పాటు పూలమాలను ఆంజనేయునికి సమర్పించారు. అనంతరం భక్తులు హనుమాన్ దండకం, ఛాలీసా పఠించారు. భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546